పల్లె ముఖం చూడని ఆర్టీసీ

బస్సు నడపాలని వేడుకుంటున్న ప్రజలు

జంగారెడ్డిగూడెం రూరల్: ఆర్టీసీని ఆదరించండి, ప్రయాణికులే మనకు దేవుళ్లు, ఆర్టీసీ నష్టాన్ని తగ్గించండి, అక్యుపెన్సీని పెంచండి. ఇవీ ఆర్టీసీ అధికారులు తరచూ చెప్పే మాటలు. వాస్తవం మాత్రం మరోలా ఉంది. రహదారి సదుపాయం ఉంది, ఆర్టీసీ సర్వీసులు తిప్పండి మహాప్రభో అంటూ మండల ప్రజలు మొరపెట్టుకున్నా ఆర్టీసీ సర్వీసులు పల్లె ముఖం చూడటం లేదు. గ్రామాల్లో కొనేళ్లుగా బస్సు సర్వీసులు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు, విద్యార్థులు అనేక అవస్థలు పడుతున్నారు. బయ్యనగూడెం, జంగారెడ్డిగూడెం మండలం శోభనాద్రిపురం మీదుగా కేతవరానికి బస్సు సర్వీసులను తిప్పాలని అధికారులకు విన్నవించుకుంటున్నారు. కేతవరం మీదుగా వయా కొయ్యలగూడెం మండలం రాజవరం, యర్రంపేట, ఆరిపాటి దిబ్బల మీదుగా తాడేపల్లిగూడెం వెళ్లేందుకు రోడ్డు మార్గం ఉంది. ఈ రహదారిలో బస్సు సర్వీస్‌ను తిప్పితే అటు తాడేపల్లిగూడెం, ఇటు జంగారెడ్డిగూడెం పట్టణాలకు రాకపోకలు సాగించొచ్చని, సర్వీసులను తిప్పాలని ప్రజలు వేడుకుంటున్నారు. అలాగే జంగారెడ్డిగూడెం నుంచి అక్కంపేట మీదుగా తిరిగే బస్సు సర్వీసు నిలిచిపోవడంతో రాకపోకలు సాగించడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామంలో పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు అధికంగా ఉండటంతో సరైన ప్రయాణ సౌకర్యం లేక అనేక ఇబ్బందులు పడుతున్నారు. సీతంపేట మీదుగా తిరుమలాపురానికి బస్సు సర్వీసును తిప్పాలని, ఇటీవల ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి గ్రామ ప్రజలు తీసుకెళ్లారు. తమ గ్రామాలకు బస్సు వేయమని ప్రజలు మొత్తుకుంటున్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఆర్టీసీ బస్సు సర్వీసులు పల్లెల్లో నడపాలని వేడుకుంటున్నారు.


తిరుమలాపురం గ్రామ వ్యూ


జంగారెడ్డిగూడెం డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు

విద్యార్థుల అవస్థలు వర్ణనాతీతం

విద్య, వ్యాపార పరంగా జంగారెడ్డిగూడెం పట్టణంపై ఎక్కువ ఆధారపడుతుంటారు. వందల సంఖ్యలో విద్యార్థులు పట్టణంలోని కళాశాలలు, పాఠశాలకు నిత్యం వెళ్లి వస్తుంటారు. అనేక గ్రామాలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు లేకపోవడంతో ఆటోలు, ఇతర వాహనాలను విద్యార్థులు ఆశ్రయించాల్సి వస్తుందని విద్యార్థుల తల్లితండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే కొన్ని గ్రామాల మీదుగా సర్వీసులు తిప్పుతున్నా అవేమీ విద్యార్థులకు, ప్రజలకు ఉపయోగకరంగా లేవని చెబుతున్నారు. కట్టవపాదలవారిగూడెం మీదుగా తిప్పుతున్న సర్వీసుల విద్యార్థులకు ఏమాత్రం ఉపయోగపడటం లేదని, ఏ సమయానికి వస్తుందో తెలియడం లేదంటున్నారు. ఉదయం 8 గంటల సమయంలో కట్టవపాదలవారిగూడెం మీదుగా జంగారెడ్డిగూడెం బస్సు నడిపితే ఉపయోగం ఉంటుందని, గ్రామ ప్రజలు, విద్యార్థులు కోరుతున్నారు. మైసన్నగూడెం మీదుగా తిరిగే సర్వీసు రాత్రి వేళల్లో వస్తుందని, ఈ సర్వీసును ఉదయం, సాయంత్రం వేళల్లో జంగారెడ్డిగూడెం వెళ్లేలా నడిపితే ఉపయోగం ఉంటుందని గ్రామ ప్రజలు వేడుకుంటున్నారు.

బస్సు సర్వీసులు లేక మహిళల ఇబ్బందులు



తిరుమలాపురానికి బస్సు తిప్పాలి. బస్సు సర్వీసులు లేకపోవడంతో మహిళలు అనేక అవస్థలు పడుతున్నారు. ఆటోలు, ఇతర వాహనాలపై ఆధారపడాల్సి వస్తుంది. ఆర్టీసీ అధికారులు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి తమ గ్రామానికి బస్సు నడిపితే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. బస్సు సర్వీసు లేక విద్యార్థులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. సమస్య పరిష్కారంపై శ్రద్ధ చూపాలి.

– వేముల రత్నకుమారి, తిరుమలాపురం

మెరుగైన ప్రయాణ సౌకర్యం కల్పించాలి



కేతవరానికి బస్సు సర్వీసును నడపాలి. ఈ గ్రామం మీదుగా బస్సు తిప్పితే ప్రజలకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. అటు తాడేపల్లిగూడెం, ఇటు జంగారెడ్డిగూడెం పట్టణానికి వెళ్లడానికి సౌకర్యం ఏర్పడుతుంది. బస్సు సర్వీసులు లేక విద్యార్థులు, ప్రజలు అనేక అవస్థలు పడుతున్నారు. బస్సులను నడిపి మెరుగైన ప్రయాణ సౌకర్యాన్ని కల్పించాలి.

– కొప్పిరిశెట్టి రవి, కేతవరం

క్లుప్తంగా

మద్ది క్షేత్రానికి భారీగా భక్తులు


స్వామి వారి దర్శనానికి క్యూలైన్‌లో బారులు తీరిన భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని గురవాయిగూడెం శ్రీమద్ది ఆంజనేయస్వామి వారిని మంగళవారం అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు స్వామి వారికి తమలపాకులతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. ఆదాయం రూ.1,96,353 వచ్చినట్లు, 3,000 మంది భక్తులు స్వామి వారి అన్న ప్రసాదాన్ని స్వీకరించినట్లు ఆలయ అసిస్టెంట్ కమిషనర్ ఆర్‌వీ చందన తెలిపారు.

విద్యార్థినికి సైకిల్ అందజేత


విద్యార్థినికి సైకిల్ అందజేస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని కాలేజీ రోడ్‌లోని శ్రీ మద్ది ఆంజనేయ మార్క్స్ లిమిటెడ్ వితరణతో విద్యార్థినికి సైకిల్ అందజేశారు. కేతవరానికి చెందిన మందపాటి భువనేశ్వరి ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతుంది. విద్యార్థినికి ప్రతి రోజూ పాఠశాలకు వెళ్లడానికి వీలుగా సైకిల్ అందజేసినట్లు శ్రీ మద్ది ఆంజనేయ మార్క్స్ లిమిటెడ్ డైరెక్టర్ దాకారపు కృష్ణ తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ దూబగుంట్ల బాపిరాజు, డాకారపు నరసింహమూర్తి , సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం పీహెచ్‌సీ పరిశీలన


పీహెచ్‌సీ పరిశీలనలో ఎమ్మెల్యే రోషన్

లింగపాలెం: లింగపాలెం పీహెచ్‌సీని స్థానిక ఎమ్మెల్యే రోషన్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఆస్పత్రిలో పరిశుభ్రత విషయంలో జాగ్రత్తలు పాటించాలని చెప్పారు. గ్రామాల్లో ఏఎన్‌ఎంలు పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని, ప్రజలకు మెరుగైన వైద్యసేవలు అందించాలని సూచించారు. అనంతరం ఆసుపత్రికి సిబ్బంది కొరత ఉందని స్థానిక నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, సమస్య పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఈవోపీఆర్డీ బాధ్యతల స్వీకరణ



టి.నరసాపురం: మండల ఈవోపీఆర్డీగా బి.శ్రీనివాసులు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇప్పటి వరకు పెదవేగి మండలం ఈవోపీఆర్డీగా విధులు నిర్వహిస్తూ, సాధారణ బదిలీల్లో భాగంగా టి.నరసాపురం వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంవీఎస్ రాంప్రసాద్ పాలకోడేరు ఈవోపీఆర్డీగా బదిలీపై వెళ్లారు.

కోయిదాలో కేవీకే శాస్త్రవేత్తల పర్యటన


రైతులకు విత్తనాలు అందిస్తున్న శాస్త్రవేత్తలు

వేలేరుపాడు: డాక్టర్ వైఎస్సార్ ఉద్యాన విశ్వవిద్యాలయం కృషి విజ్ఞాన కేంద్రం వెంకట్రామన్నగూడెం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ఇ.కరుణశ్రీ, విస్తరణ శాస్త్రవేత్త డాక్టర్ వి.దీప్తి మంగళవారం కోయిదా గ్రామాన్ని సందర్శించారు. గిరిజన రైతులతో వ్యవసాయం సాగు విధానాలను గురించి వారు సాగు చేస్తున్న వరి, మినుములు, కంది పంటల సాగు మెలకువలు గురించి చర్చించారు. అనంతరం గిరిజన ఉప ప్రణాళికలో భాగంగా పెరటి తోటల పెంపకానికి కోయిదా గ్రామ రైతులకు 12 రకాల విత్తనాలు 100 కిట్స్, కంది విత్తనాలు కృష్ణ రకం (ఎల్‌ఆర్‌జీ 105)ను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో కారం వాసు, కోటం మోహన్‌రావు, ఎల్ ఎన్ శ్రీనివాసరావు, రాజారెడ్డి, మహిళలు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

చింతలపూడి: జంగారెడ్డిగూడెం డీఎస్పీ యు.రవిచంద్ర ఆదేశాల మేరకు సీఐ రవీంద్ర ఆధ్వర్యంలో చింతలపూడి భట్టువారిగూడెంలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంపై పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించారు. దాడుల్లో ఆరుగురిని అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.3,900 నగదును స్వాధీనం చేసుకున్నారు.

తిరువూరు ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలి

చింతలపూడి: తిరువూరు ఎమ్మెల్యే కొలికిపూడి శ్రీనివాసరావు రైతులపై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పౌరహక్కుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పిడపర్తి ముత్తారెడ్డి అన్నారు. మంగళవారం చింతలపూడిలో ఆయన మాట్లాడుతూ మనుషులకు, జంతువులకు తేడా తెలియకుండా అనుచిత వ్యాఖ్యలు చేసిన కొలికిపూడిపై తక్షణం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అదే విధంగా గతంలో రైతులకు రుణమాఫీ చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి చంద్రబాబు రెండు, మూడు విడతలు చేసి చేతులు దులుపుకున్నారని, రైతులకు బకాయి ఉన్న రెండు విడతల రుణమాఫీని చంద్రబాబు ఇప్పుడు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు.

బాణసంచా స్వాధీనం


పోలీసులు స్వాధీనం చేసుకున్న బాణసంచా

కొయ్యలగూడెం: అక్రమంగా రవాణా చేస్తున్న దీపావళి బాణసంచాను సీజ్ చేసినట్లు ఎస్సై వి.చంద్రశేఖర్ మంగళవారం పేర్కొన్నారు. కన్నాపురం గ్రామానికి చెందిన వ్యక్తులు వీటిని రవాణా చేస్తుండగా గుర్తించి, స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామని ఆయన తెలిపారు. దీపావళి నేపథ్యంలో బాణసంచా అక్రమ నిల్వలపై సమాచారాన్ని అందజేయాల్సిందిగా ఆయన సూచించారు. పట్టుకున్న దీపావళి బాణసంచా విలువ సుమారు రూ.2.5 లక్షల వరకు ఉంటుందన్నారు.

పారదర్శకంగా మద్యం షాపుల టెండర్లు

చింతలపూడి: ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో మద్యం షాపుల టెండర్ల ప్రక్రియ పారదర్శకంగా నిర్వహిస్తున్నట్లు సీఐ రవీంద్ర నాయక్ తెలిపారు. మంగళవారం ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయం వద్ద టెండర్ల ప్రక్రియను ఆయన పరిశీలించారు. ప్రొహిబిషన్, ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.అశోక్‌కుమార్ మాట్లాడుతూ సర్కిల్‌లో ఇప్పటి వరకు 175 టెండర్లు వచ్చాయని తెలిపారు.


మద్యం షాపుల టెండర్ల ప్రక్రియను పరిశీలిస్తున్న సీఐ రవీంద్ర నాయక్

మేము సైతం

జంగారెడ్డిగూడెం: మద్యం షాపుల కోసం దరఖాస్తు చేసుకునేందుకు మేము సైతం అంటూ మహిళలు ముందుకొచ్చారు. మద్యం షాపుల కోసం ఇప్పటి వరకు పురుషులు మాత్రమే పోటీ పడేవారు. కాని, పురుషులకు తామేమి తీసిపోమన్నట్లుగా మహిళలు సైతం దరఖాస్తులు చేస్తున్నారు. ఈ సంఘటన జంగారెడ్డిగూడెంలో చోటు చేసుకుంది.

భూముల పరిశీలన

పోలవరం రూరల్: రోడ్డు నిర్మాణానికి సేకరించే భూములకు సంబంధించి జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి అవార్డు ఎంక్వైరీ నిర్వహించారు. జీలుగుమిల్లి నుంచి కన్నాపురం, పట్టిసీమ మీదుగా నిర్మించే ఎన్‌హెచ్ 365 రోడ్డు నిర్మాణానికి సేకరించే భూములకు సంబంధించిన రైతులతో మంగళవారం జేసీ అవార్డు ఎంక్వైరీ నిర్వహించారు. ఈమె వెంట పోలవరం తహసీల్దార్ ఆర్ఎస్ రాజు ఉన్నారు.


పట్టిసంలో భూములను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ పి.ధాత్రిరెడ్డి

మహిళలకు భద్రత కల్పించాలి

కుక్కునూరు: మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం పటిష్ట చట్టాలు అమలు చేయాలని ఏలూరు జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని బండారిగూడెంలో వంజం నందిని అధ్యక్షతన శాఖా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వరకా శ్యామల, మన్నవ యామిని మాట్లాడుతూ రోజు రోజుకూ చిన్నారులపై లైంగిక దాడులు, అఘాయిత్యాలు వంటి దుశ్చర్యలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభం, శుభం తెలియని చిన్నారులను చిదిమేయడం ఎంతో అమానుషమన్నారు. లైంగిక దాడులను అరికట్టేందుకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను అమలు చేసి మహిళలకు భద్రత కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మడివి సమిత, ముస్కి, మంగ, ముస్కి సౌందర్య, వంజం గంగ పాల్గొన్నారు.

ఏకీకృత ఎన్నికలు సరికాదు

చింతలపూడి: దేశంలో బీజేపీ అధికారాన్ని కేంద్రీకృతం చేయడం కోసమే జమిలి ఎన్నికలని సంకీర్ణ రాజకీయ వ్యవస్థ జరుగుతున్న తరుణంలో ఏకీకృత ఎన్నికలు సరికాదని సీపీఐ జాతీయ కార్యవర్గ సభ్యురాలు అక్కినేని వనజ అన్నారు. మంగళవారం స్థానిక సీపీఐ కార్యాలయంలో చింతలపూడి సీపీఐ మండల జనరల్ బాడీ సమావేశం మండల కార్యదర్శి కంచర్ల గురవయ్య అధ్యక్షతన నిర్వహించారు. జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన అక్కినేని వనజ మాట్లాడుతూ జమిలి ఎన్నికలు ఎవరికి ఉపయోగం లేదన్నారు. సీపీఐ మండల సహాయ కార్యదర్శులు పుల్లారు సోమశేఖర్, తొర్లపాటి బాబు, జంగా రామచంద్రారెడ్డి, బోయ రాఘవ, నాగేశ్వరావు, గంధం అంజమ్మ పాల్గొన్నారు.

కోడిపందేల స్థావరంపై దాడి

జంగారెడ్డిగూడెం రూరల్: మండలంలోని మైసన్నగూడెంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో కోడి పందేల స్థావరంపై పోలీసులు దాడులు చేశారు. కోడి పందేలు ఆడుతున్నారనే సమాచారంతో ఎస్సై జబీర్ సిబ్బందితో దాడులు చేశారు. ఈ దాడుల్లో 8 మందిని అదుపులోకి తీసుకొని, వారి నుంచి రూ.14,680, 9 ద్విచక్ర వాహనాలు, రెండు కోడి కత్తులు, రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

హీరో గ్లామర్ ఓజీ ఆవిష్కరణ


హీరో గ్లామర్ వాహనాన్ని ఆవిష్కరించిన సీఐ రవీంద్ర నాయక్

చింతలపూడి: హీరో కంపెనీ ప్రవేశ పెట్టిన హీరో గ్లామర్ ఓజీ ద్విచక్ర వాహనాన్ని మంగళవారం చింతలపూడి సీఐ రవీంద్ర నాయక్ చింతలపూడి జహీర్ మోటార్స్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సీఐ రవీంద్ర నాయక్ వాహన కొనుగోలుదారులకు వాహనాలను అందించారు. ఈ సందర్భంగా సీఐ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ హీరో గ్లామర్ ఓ జి వాహనం ప్రవేశ పెట్టడం అనందనీయమని, వాహనదారులు ఖచ్చితంగా హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో జహీర్ మోటార్స్ అధినేత సయ్యద్ ఖాజా మొహిద్దిన్, లోక్ అదాలత్ మెంబర్ ఎండీ అక్బర్ అలి,ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు ఎస్‌కే అజాద్, టూ వీలర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు జి.రాజేష్ నాయుడు, తదితరులు పాల్గొన్నారు.

మహాలక్ష్మీదేవిగా అమ్మవారి దర్శనం


జంగారెడ్డిగూడెం: మహాలక్ష్మిగా వాసవీ కన్యకాపరమేశ్వరి


కొయ్యలగూడెం: నోట్ల కరెన్సీ అలంకరణతో వాసవీ కన్యకాపరమేశ్వరి

పలు ఆలయాలు భక్తులతో కిటకిట

జంగారెడ్డిగూడెం: పట్టణంలో కొలువైన అమ్మవార్లు మహాలక్ష్మీదేవి అలంకరణలో విశేష పూజలందుకున్నారు. జంగారెడ్డిగూడెం గంగానమ్మ అమ్మవారిని రూ.2.30 కోట్లతో ప్రత్యేకంగా అలంకరించారు. పూజా కార్యక్రమాల్లో ఎంఎస్ రామారావు దంపతులు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. శ్రీ సరస్వతీదేవిగా చిన్నారులచే నూకాలమ్మ అమ్మవారు సామూహిక పూజలు అందుకున్నారు. ఆలయ కమిటీ చైర్మన్ రాజాన సత్యనారాయణ (పండు), రామలక్ష్మి దంపతులు ఆధ్వర్యంలో ఆలయ కల్యాణ వేదిక వద్ద చిన్నారులతో సామూహిక సరస్వతి పూజ అర్చక స్వాములు వేదోక్తంగా నిర్వహించారు. జంగారెడ్డిగూడెం ముత్యాలమ్మ అమ్మవారిని మహాలక్ష్మి అవతారంలో అలంకరించారు. ఆలయ నిర్మాణ కర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో అమ్మవారిని మహాలక్ష్మిగా అలంకరించి, పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఎర్రకలువలతో పూజ, తామర బీజార్చన, కుంకుమార్చన నిర్వహించారు. విజయదుర్గమ్మ అమ్మవారిని రూ.కోటితో సుందరంగా అలంకరించారు. అనంతరం అమ్మవారికి రూపాయి నాణాలతో అభిషేకం నిర్వహించారు. వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు మహాలక్ష్మిదేవిగా పూజలందుకుంది. రూ.75లక్షలతో అమ్మవారిని అలంకరించి, లక్ష పుష్పార్చన నిర్వహించారు. చాముండేశ్వరి అమ్మవారు లలితా పరమేశ్వరిగా పూజలు అందుకోగా, ఆలయంలో దీక్షాధారణ, అఖండ దీపారాధన, పంచామృతాభిషేకం, తదితర పూజలు అర్చకులు మామిళ్లపల్లి ఆనందశివాచార్యులు నిర్వహించారు. గోకుల తిరుమల పారిజాతగిరి ఉద్యావన వనంలో వేంచేసి యున ముగ్గరమ్మలను మహాలక్ష్మీదేవిగా రూ.8.55 లక్షలతో అలంకరించినట్లు ఈవో మానికల రాంబాబు తెలిపారు.

మహాలక్ష్మీదేవిగా రాజరాజేశ్వరి

జంగారెడ్డిగూడెం రూరల్: దేవీ శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండలంలో ఆలయాల్లో, చలువ పందిళ్ల కింద ఏర్పాటు చేసిన అమ్మవార్ల ప్రతిమలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. గురవాయిగూడెం రామలింగేశ్వరస్వామివారి క్షేత్రంలో కొలువైన శ్రీరాజరాజేశ్వరీ అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా, అయ్యప్ప క్షేత్రంలో ఉపాలయంలో కొలువైన శ్రీజ్ఞాన సరస్వతీ అమ్మవారు శ్రీమహాలక్ష్మీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ

కొయ్యలగూడెం: దేవీ శరన్నవరాత్రులలో భాగంగా కనకదుర్గమ్మ మంగళవారం మహాలక్ష్మీదేవి అలంకరణతో భక్తులకు దర్శనమిచ్చింది. కన్నాపురంలో శ్రీవాసవీ ఆర్యవైశ్య సేవా సంఘం ఆధ్వర్యాన దసరా తృతీయ వార్షికోత్సవ సందర్భంగా కనకదుర్గమ్మను మహాలక్ష్మీదేవిగా అలంకరించారు. ఈ సందర్భంగా రూ.10,81,000 లతో అలంకరించారు. కొయ్యలగూడెం బయ్యనగూడెం శ్రీ చక్ర సహిత కనకదుర్గమ్మ అదేవిధంగా కన్నాపురం రోడ్డులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలోని అమ్మవారు వై.జంక్షన్, రాజవరం, యర్రంపేట, గవరవరం, అచ్యుతాపురం గ్రామాలలోని కనకదుర్గమ్మ ఆలయాలలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

మహాలక్ష్మిగా కుంకుళ్లమ్మ

ద్వారకాతిరుమల: క్షేత్ర దేవతగా విరజిల్లుతున్న శ్రీ కుంకుళ్లమ్మ అమ్మవారు మంగళవారం శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. కరెన్సీ నోట్ల నడుమ, చిరు మందహాసంతో అమ్మవారు అభయ హస్తాన్ని ప్రదర్శిస్తూ భక్తులను కటాక్షించారు. అలాగే స్థానిక ఆర్యవైశ్య కల్యాణ మండప ఆవరణలోని ఆలయంలో కొలువైన శ్రీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు శ్రీ మహాలక్ష్మీదేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

మహాలక్ష్మిగా కనకదుర్గమ్మ

పోలవరం రూరల్: కనకదుర్గమ్మ అమ్మవారిని మహాలక్ష్మీదేవిగా అలంకరించి భక్తులు పూజలు నిర్వహించారు. మంగళవారం అమ్మవారికి కుంకుమ పూజలతో పాటు పలు రకాల పుష్పాలతో పూజలు నిర్వహించారు.


జంగారెడ్డిగూడెం రూరల్: గురవాయిగూడెంలో మహాలక్ష్మిగా అలంకరించిన రాజరాజేశ్వరి


పోలవరం రూరల్: మహాలక్ష్మీదేవిగా అలంకరించిన కనకదుర్గమ్మ అమ్మవారు


ద్వారకాతిరుమల: మహాలక్ష్మీదేవి అలంకరణలోని వాసవీ కన్యకాపరమేశ్వరి అమ్మవారు

రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలి


కొయ్యలగూడెంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయాధికారులు


లింగపాలెంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాఖ ఏడీఏ నాగకుమార్

కొయ్యలగూడెం: రైతులు సస్యరక్షణ చర్యలు చేపట్టాలని మండల వ్యవసాయాధికారి చెన్నకేశవులు అన్నారు. మంగళవారం పొలం పిలుస్తుంది కార్యక్రమం బోడిగూడెం, మంగపతిదేవిపేట గ్రామ పంచాయతీల పరిధిలో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హబ్ మేనేజర్ బి.సోమశేఖర్ హాజరై వ్యవసాయం, వివిధ పంటల్లో పోషక యజమాన్యం గురించి, వరిలో వచ్చే సస్య రక్షణ చర్యల గురించి రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి చెన్నకేశవులు మాట్లాడుతూ జీవ ఎరువులు వాటి ఉపయోగం గురించి, వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాల గురించి అవగాహన కల్పించారు. రైతులు డ్రిప్ సిస్టం, ఐదు ఎకరాల పైబడిన రైతులకు 70 శాతం రాయితీ అమలు చేయాలని, వ్యవసాయ యంత్ర పరికరాలు రైతులకు రాయితీపై ఇవ్వాలని కోరారు. ఉద్యాన శాఖ వీఏఏ చందు పశువర్ధక శాఖ అసిస్టెంట్ పి.సాయిరాం, పట్టు పరిశ్రమ శాఖ సెరికల్చర్ అధికారి జి.రామాంజి, సర్పంచ్ కె.గడ్డియ్య, తదితరులు పాల్గొన్నారు.

లింగపాలెం: మండలంలోని కొత్తపల్లి రైతు సేవా కేంద్రంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. పంట సాగుపై రైతులకు పలు సూచన సలహాలను వ్యవసాయ అధికారులు అందజేశారు. కార్యక్రమంలో చింతలపూడి సహాయ వ్యవసాయ సంచాలకులు బి.నాగకుమార్, లింగపాలెం మండల వ్యవసాయ అధికారి కె.మురళీకృష్ణ, రైతులు, ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.